సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 3, ఆగస్టు, 2023



కళ్ల కలకతో ఆందోళన వద్దు

కళ్లకలక ఒకరి నుంచి మరొకరికి సోకుతుందని, ఆందోళన చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



నిర్లక్ష్యంతోనే వరద కష్టాలు

అధికారులకు ముందుచూపు లేకపోవడంతోనే ప్రజలు ముంపు బారిన పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని అన్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 25°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



ఏపీలో స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులకు బుధవారం స్నపన తిరుమంజనం చేశారు. ప్రతి బుధవారం స్వామివారికి ఈ వేడుక నిర్వహిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భద్రాద్రి రామయ్యకు ఏపీలో కల్యాణం

ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, బాపట్ల పట్టణాల్లో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వార్లకు బుధవారం వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అక్కడి ధార్మిక సంస్థల అభ్యర్థన మేరకు ప్రచార రథంతో ఉత్సవమూర్తులను తీసుకెళ్లగా భక్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, ఏఈఓ శ్రావణ్‌కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

నేడు నులిపురుగుల నివారణ కార్యక్రమం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్.శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన మాప్ ఆఫ్ డే కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 1 – 2 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర పొడిచేసి నీళ్లలో కలిపి చెంచాతో తాగించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు మాత్ర నమిలిన తర్వాత నీరు తాగించాలని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె మహీధర్, కోశాధికారి రాసపెల్లి రాజేంద్రప్రసాద్, రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, యోగా జిల్లా కార్యదర్శి గుమలాపురం సత్యనారాయణ, ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ జిల్లా కార్యదర్శి బరిగెల భూపేష్, అథ్లెటిక్స్ జిల్లా కోచ్ నాగేందర్ పాల్గొన్నారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని వివిధ మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గుండాల తహసీల్దార్ వి.నాగదివ్యను అశ్వాపురానికి, టేకులపల్లి తహసీల్దార్ వి.వీరభద్రంను ఆళ్లపల్లికి, ఇల్లెందు తహసీల్దార్ కె.కృష్ణవేణిని టేకులపల్లికి, ఆళ్లపల్లి తహసీల్దార సాదియాసుల్తానాను చంద్రుగొండకు, చుంచుపల్లి నుంచి వి.కృష్ణప్రసాద్‌ను భద్రాచలానికి, లక్ష్మీదేవిపల్లి నుంచి సీహెచ్.నాగరాజును చుంచుపల్లికి, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసే డి.వీరభద్రప్రసాద్‌ను పినపాకకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ఖమ్మం జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు హెచ్.రంగాను గుండాలకు, తుమాటి శ్రీనివాస్‌ను మణుగూరుకు, డి.తిరుమలాచారిని కరకగూడేనికి, దారా ప్రసాద్‌ను కలెక్టరేట్‌కు, డి.శిరీషను దుమ్ముగూడేనికి, కె.రవికుమార్‌ను ఇల్లెందుకు, ఎం.రమాదేవిని సుజాతనగర్‌కు, డి.జగదీశ్వరప్రసాద్‌ను అన్నపురెడ్డిపల్లికి, వి.వి.శకుంతలను కలెక్టరేట్ ఏఓగా, ఎండీ.ముజాహిద్‌ను దమ్మపేటకు, జి.పుల్లారావును ములకలపల్లికి, కేఆర్‌కేవీ.ప్రసాద్‌ను లక్ష్మీదేవిపల్లికి, డి.పుల్లయ్యను కొత్తగూడేనికి బదిలీ చేశారు.

దశ దిశ మారేనా?



భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్

'అమృత్'లో ఉమ్మడి జిల్లా నుంచి మూడు స్టేషన్లు

- మౌలిక సదుపాయాల మెరుగుకు భారీగా నిధులు
- ఈనెల 6న శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- కొత్తగూడెం స్టేషన్‌ను ఆర్టీసీతో అనుసంధానం చేయాలనే డిమాండ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి జిల్లాలో రైల్వే పరంగా కీలకమైన మూడు స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రైల్వే శాఖ రూ.75 కోట్లకు పైగా నిధులను అమృత్ భారత్ పథకంలో భాగంగా కేటాయించింది. ఈ నిధులతో ఖమ్మం, మధిర, భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) స్టేషన్లలో పనులు ప్రారంభించనున్నారు.

ఆధునిక సౌకర్యాలు

నేటి తరం ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరించేందుకు కేంద్రం అమృత్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం తొలిదశలో తెలంగాణలో మొత్తం 21 స్టేషన్లు ఎంపికయ్యాయి. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం స్టేషన్‌కు రూ.25.4 కోట్లు, మధిరకు రూ. 25.4కోట్లు, భద్రాచలంరోడ్ స్టేషన్‌కు రూ.24.4 కోట్ల చొప్పున కేటాయించారు. ఈ నిధులతో స్టేషన్లలో కేఫ్‌టేరియా, ఫుడ్‌కోర్ట్, వెయిటింగ్ హాళ్లు, ఎస్కలేటర్లు, వైఫై, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌, బోర్డులు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు స్టేషన్ ఆవరణలో ఇన్, అవుట్ మార్గాలు, పార్కింగ్, గార్డెన్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ఈ మేరకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయగా టెండర్ల ప్రక్రియ కూడా చివరి దశకు చేరుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 6న అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.

ఇదే కీలకం..

జిల్లాలో పదికి పైగా రైల్వే స్టేషన్లు ఉన్నా.. మణుగూరు, భద్రాచలం రోడ్ స్టేషన్లే కీలకం. రైల్వే ప్రయాణికుల్లో 90 శాతం మంది భద్రాచలం రోడ్ స్టేషన్‌నే ఉపయోగిస్తున్నారు. పైగా రైలు ప్రయాణం చవక కావడంతో కొత్తగూడెం వరకు రైళ్లలో వచ్చిన ప్రయాణికులు స్టేషన్‌లో దిగి బస్సుల ద్వారా పాల్వంచ, భద్రాచలం, మణుగూరు వెళుతుటారు. జిల్లాలో ఇల్లెందును మినహాయిస్తే మిగిలిన మండలాలతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంత ప్రజలకు భద్రాచలం రోడ్ స్టేషన్ ఎంతో కీలకం. ప్రస్తుతం రైల్వే, బస్ స్టేషన్ల మధ్య అందుబాటులో ఉన్న రోడ్డు కిలోమీటరు వరకు నిడివి వస్తోంది. ఈ రోడ్డు రైల్వే స్టేషన్ నార్త్ సైడ్ టెర్మినల్ నుంచి బయలుదేరి అండర్ బ్రిడ్జిని దాటుకుని బస్ స్టేషన్‌కు చేరుకుంటుంది. దీంతో ఒకేసారి రోడ్డు, రైలు మార్గాల్లో ప్రయాణించే దూర ప్రాంతాల వారికి ఈ స్టేషన్ల మధ్య దూరం ఇబ్బందిగా మారింది.

కొత్తగూడెం స్టేషన్‌లో..

భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌లో పూర్తి స్థాయిలో కేఫ్‌టేరియా/ఫుడ్ కోర్టు ఇప్పటికీ అందుబాటులో లేదు. దీంతో అమృత్ భారత్‌లో ఫుడ్ కోర్టుకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం స్టేషన్ ఆవరణలో బుకింగ్ కౌంటర్ నుంచి రామాలయం వరకు ఉన్న ప్రదేశాన్ని ఫుడ్‌కోర్టు నిర్మాణానికి ఎంపిక చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న గదులు, ఇతర నిర్మాణాలను తొలగించి కొత్తగా రెండతస్తుల భవనం నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కింది అంతస్తును ఫుడ్‌కోర్టుకు కేటాయించగా పై అంతస్తును రైల్వే కార్యాలయాలు, రిటైరింగ్ రూమ్‌ల కోసం వినియోగించనున్నారు. ఈ భవన నిర్మాణానికి రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. దీంతో పాటు ప్రస్తుతం స్టేషన్‌లోకి ఒకటే ఎంట్రన్స్ ఉంది. దీన్ని అభివృద్ధి చేసి ఇన్ అండ్ ఔట్ మార్గాలుగా డెవలప్ చేయనున్నారు. దీంతో పాటు స్థానిక సంస్కృతి ఉట్టిపడేలా ఆర్చ్ కూడా నిర్మించనున్నారు.

సౌత్ టెర్మినల్‌తో సౌకర్యం..

వాస్తవానికి కొత్తగూడెంలో బస్, రైల్వే స్టేషన్ల మధ్య దూరం గరిష్టంగా వంద మీటర్లు కూడా ఉండదు. స్టేషన్‌లో ప్రస్తుతం ఉపయోగిస్తున్న నార్త్ టెర్మినల్‌కు అదనంగా రైల్వే క్వార్టర్లు ఉన్న దక్షిణం దిక్కున మరో టెర్మినల్‌ను నిర్మిస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. సౌత్ వైపు బస్ స్టేషన్ – రైల్వే స్టేషన్‌ను కలిపే రోడ్డును అభివృద్ధి చేసి, బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తే భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు నాలుగైదు నిమిషాల నడకతో బస్‌స్టేషన్‌కు చేరుకునే సౌలభ్యం ఏర్పడుతుంది. అమృత్ భారత్‌లో భద్రాచలంరోడ్‌లో సౌత్ టెర్మినల్‌కు చోటు కల్పించాలనే డిమాండ్ ప్రయాణికుల నుంచి వస్తోంది.

వైన్స్ లైసెన్సుల ప్రక్రియ షురూ..

- రిజర్వేషన్లలో ఎలాంటి మార్పూ లేదు
- రాబోయే రెండేళ్ల కాలానికి 88 షాపులు
- 2019 – 21లో జిల్లా వ్యాప్తంగా 76 దుకాణాలే
- ఎస్టీలకు 44 వైన్స్ కేటాయింపు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే రెండేళ్ల కాలానికి మద్యం లైసెన్సుల కోసం ఎక్సైజ్ శాఖ రిజర్వేషన్లు ఖరారు చేసింది. 2021 – 23 సంవత్సరాల్లో జిల్లాలో 88 వైన్స్‌లకు అనుమతి ఇవ్వగా ఈసారి కూడా అదే సంఖ్యలో ఉండాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో అమలవుతున్న ఏజెన్సీ చట్టాలు, స్థానికంగా ఉన్న జనాభా ఆధారంగా 88 వైన్స్‌లను వివిధ సామాజిక వర్గాల వారికి కేటాయిస్తూ రిజర్వేషన్లను ప్రకటించింది. రెవెన్యూ జిల్లాల వారీగా కాకుండా ఎక్సైజ్ జిల్లాల వారీగా ఈ రిజర్వేషన్లు ప్రకటించింది.

ఎస్టీలకు సగం

కొత్తగూడెం ఎక్సైజ్ జిల్లా పరిధిలో సింహభాగం షెడ్యూల్డ్ ఏరియాలో ఉంది. దీంతో గిరిజనుల ప్రత్యేక చట్టాలను పరిగణనలోకి తీసుకుంటూ ఏకంగా 44 దుకాణాలను ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించారు. రాష్ట్రంలో అత్యధికంగా ఎస్టీలకు వైన్ షాపులు ఇక్కడే దక్కాయి. 12 వైన్స్‌తో మహబూబాబాద్ రెండో స్థానం, 11 వైన్స్‌తో భూపాలపల్లి జిల్లా మూడో స్థానంలో ఉన్నాయి. ఇక సామాజిక వర్గాల వారీగా చూస్తే ఎస్సీలకు 7, గౌడలకు 6 మద్యం దుకాణాలు కేటాయించారు. రిజర్వేషన్ కేటగిరీలు అన్నీ పోగా ఓపెన్ కేటగిరీలో 31 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో శుక్రవారం కొత్త నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. ఆ రోజు నుంచే ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈనెల 20 లేదా 21 తేదీల్లో లాటరీ ద్వారా ఈ షాపులు కేటాయించే అవకాశం ఉంది.

నవంబర్ 30 వరకు గడువు..

జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న 88 వైన్స్‌కు లైసెన్స్ గడువు ఈ ఏడాది నవంబర్ 30 వరకు ఉంది. అప్పటివరకు పాత లైసెన్సుదారులకే మద్యం అమ్మకాలకు అనుమతి ఉంటుంది. అయితే ఆగస్టు చివరి వారంలో నిర్వహించే లాటరీలో వైన్స్ దక్కించుకున్న వారు తమ వ్యాపార కార్యకలాపాలను 2023 డిసెంబర్ 1 నుంచి నిర్వహించాల్సి ఉంటుంది. ఆగస్టు తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉండడంతో మద్యం లైసెన్సుల ప్రక్రియను ప్రభుత్వం ముందుకు జరిపిందనే వాదన వినిపిస్తోంది. 2019 – 21 సంవత్సరాల్లో జిల్లాలో 76 వైన్స్‌కే లైసెన్సులు మంజూరు చేయగా, 2021 – 23 టర్మ్‌లో ఈ సంఖ్యను 88కి పెంచారు. రాబోయే రెండేళ్లకూ ఇదే వర్తించనుంది.

రిజర్వేషన్లు ఇలా

ఎక్సైజ్ స్టేషన్	గౌడ	ఎస్సీ	ఎస్టీ	ఓపెన్	మొత్తం
కొత్తగూడెం	03	02	06	08	19
పాల్వంచ	-	02	05	06	13
అశ్వారావుపేట	02	01	-	08	11
మణుగూరు	-	-	14	01	15
భద్రాచలం	-	-	13	03	16
ఇల్లెందు	01	02	06	05	14
మొత్తం	06	07	44	31	88

వరద నష్టం పరిశీలనకు నేడు కేంద్ర బృందం

- అధికారులంతా అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక, పక్కన పీఓ ప్రతీక్ జైన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను, నష్టాన్ని పరిశీలించేందుకు గురువారం కేంద్ర బృందం పర్యటించనుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఐడీఓసీలో బుధవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, ఆర్ అండ్‌బీ, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కమిటీ పర్యటన నేపథ్యంలో అధికారులంతా అందుబాటులో ఉండాలని చెప్పారు. మండలం, క్లస్టర్ వారీగా జరిగిన నష్టాలపై వివిధ శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు. నష్టాల గణన సందర్భంగా అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరించాలని, ఎలాంటి పక్షపాతాలకు తావులేకుండా పారదర్శకంగా నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. దెబ్బతిన్న పంటల విస్తీర్ణం, సర్వే నంబర్ ఆధారంగా సమగ్ర నివేదికలు తయారు చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, డీపీఓ రమాకాంత్, పశుసంవర్థక శాఖాధికారి పురంధర్, వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఉద్యానశాఖాధికారి మరియన్న, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, పీఆర్ ఈఈ మంగ్యా, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలి..

జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఎలక్ట్రో రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రణాళిక రూపకల్పనపై బుధవారం ఐడీఓసీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఈ ప్రణాళిక ముఖ్యమని చెప్పారు. ఎలాంటి తప్పులకు తావు లేకుండా తయారుచేయాలని సూచించారు. ప్రణాళిక పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రత్యేకాధికారులు సంజీవరావు, మనోహర్, వేణు, విద్యాలత, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, భద్రాచలం ఆర్డీఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అందుబాటులో ఉండాలి

బూర్గంపాడు: గోదావరి వరదలతో దెబ్బతిన్న పంటల పరిశీలనకు గురువారం కేంద్ర బృందం రానుందని మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి వరదలతో పంట నష్టం జరిగిన భూములను బృందం పరిశీలిస్తుందని, నష్టపోయిన రైతులు అందుబాటులో ఉండాలని సూచించారు.

దాహార్తి తీర్చాలంటూ 6 కి.మీ. పాదయాత్ర



ఖాళీ బిందెలతో పాదయాత్ర చేస్తున్న ఆదివాసీలు

చర్ల : తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కలివేరు గ్రామ పంచాయతీ పరిధిలోని రజబ్‌ఆలీ కాలనీకి చెందిన ఆదివాసీలు బుధవారం ఆరు కిలోమీటర్లు ఖాళీ బిందెలతో పాదయాత్ర నిర్వహించి మండల కేంద్రానికి చేరుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కొలగాని బ్రహ్మాచారి మాట్లాడుతూ.. రజబ్‌ఆలీ కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్లు వేయకుండానే బిల్లులు మాయం చేశారని ఆరోపించారు. ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామానికి తాగునీరు ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ఆ కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని, రహదారి నిర్మించాలని, సాగులో ఉన్న ఆదివాసీలందరికీ పోడు హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్, నాయకులు భూక్యా రమేష్, జిలకర పద్మ, ఎస్. సాంబశివరావు, తాళ్లూరి కృష్ణ, కొమరం కాంతారావు, మచ్చా రామారావు, బందెల చంటి, తాటి నాగమణి, బాలాజీ, నాగేంద్ర, సమ్మక్క పాల్గొన్నారు.

ఆదిలోనే ఆగిన 'ఆర్ట్'

- ట్రైబల్ ఆర్ట్ స్కూల్‌కు నిధులు కేటాయించినా విడుదల చేయని గిరిజన శాఖ
- బోర్డులకే పరిమితమైన ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు
- అభివృద్ధి లేక దిక్కులు చూస్తున్న ట్రైబల్ మ్యూజియం
- నూతన పీఓ అయినా దృష్టి పెట్టేనా ?





ఐటీడీఏలో ఉన్న ట్రైబల్ ఆర్ట్స్ స్కూల్ (ఇన్‌సెట్) గిరిజన తెగలను వివరించే డాలా వస్త్రం

భద్రాచలం: ఆదివాసీ జాతుల సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని, లిపి లేక ఆదరణకు నోచుకోని గిరిజన సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశంతో భద్రాచలానికి గిరిజన సంక్షేమ శాఖ ప్రకటించిన ట్రైబల్ ఆర్ట్ స్కూల్ బోర్డుకే పరిమితమైంది. భద్రాచలంతో పాటు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు, ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏల్లో ట్రైబల్ ఆర్ట్స్ స్కూళ్లను గతేడాది జూలైలో ప్రారంభిస్తున్నట్లుగా గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రైబల్ వెల్ఫేర్, ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ ఒక్కో స్కూల్‌కు తొలిదశలో రూ.15 లక్షల చొప్పున ప్రకటించారు. భద్రాచలం ఐటీడీఏకు డోలి కళలో పద్మశ్రీ అవార్డు అందుకున్న సకిలం రామచంద్రయ్య, ఉట్నూరులో గుస్సాడి కళాకారుడు పద్మశ్రీ కనకరాజును ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ వారికి నెలకు రూ.20వేల గౌరవ వేతనం కూడా ప్రకటించారు.

ఆదివాసీల సంస్కృతి, కళల రక్షణకు..

గతేడాది ఆదివాసీ డోలి కళలో ప్రావీణ్యం పొందిన మణుగూరుకు చెందిన రామచంద్రయ్య, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గుస్సాడి కళాకారుడు కనకరాజుకు రాష్ట్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. దీంతో అంతరించి పోతున్న ఆదివాసీ కళలను రక్షించాలని, గిరిజనుల లిపి లేని సంస్కృతి సంప్రదాయాలను, కళలను భవిష్యత్ తరాల వారికి అందించాలని గిరిజన సంక్షేమ శాఖ భావించింది. ఈ మేరకు భద్రాచలంలో డోలి, రేలా, కొమ్ము డ్యాన్స్ కళలపై, ఉట్నూరులో గుస్సాడి కళ, ఏటూరు నాగారంలో కొమ్ము నృత్యంపై శిక్షణ ఇవ్వాలని ట్రైబల్ ఆర్ట్ స్కూళ్లను మంజూరు చేస్తూ ఐటీడీఏ పీఓలకు బాధ్యతలు అప్పగించింది.

బోర్డులకే పరిమితం..

ప్రభుత్వ నిర్ణయంతో స్థానిక అధికారులు ఒక్కో టీంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల్లో నిపుణులైన కళాకారులు, వాయిద్య కారులు ఐదుగురితో కలిసి ఐదు టీమ్‌లు సిద్ధం చేశారు. దమ్మపేట, అశ్వారావుపేట, చర్ల, దుమ్ముగూడెం తదితర మండలాల్లో ఆశ్రమ పాఠశాలలను గుర్తించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే గిరిజన సంక్షేమ శాఖ ప్రకటించిన ఆర్ట్ స్కూల్ బోర్డులకు, జీవోలకే పరిమితమైంది. ప్రకటించిన రూ. 15 లక్షల్లో ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. గతేడాది మొదలవుతుందని భావించిన ఆర్ట్ స్కూల్ ఈ సంవత్సరం కూడా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఇన్‌చార్జ్‌గా నియమితులైన సకిలం రామచంద్రయ్య సైతం మిన్నకుండిపోయారు. ఆదివాసీల సంస్కృతి చాలా విభిన్నమైంది. లిపి లేకపోయినప్పటికీ చిత్రలేఖనంతో వస్త్రం పై లిఖించే 'డాలా వస్త్రం' ఉంటుంది. దీనిపైనే ఆదివాసీలకు చెందిన తెగలు, గోత్రాలను తెలిపే చిత్రాలు ఉంటాయి. వీటి ఆధారంగానే వారిలో ఏయే తెగలకు చెందిన వారి నడుమ పెళ్లిళ్లు చేసుకోవాలి, ఏ జంతువులను ఆహారంగా తీసుకోవాలి, వేట వంటి పురాతన సంప్రదాయలకు చెందిన అనేకం లిఖించి ఉంటాయి. ఈ విషయాలను గిరిజన విద్యార్థులకు నేర్పించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ట్రైబల్ ఆర్ట్స్ స్కూళ్ల లక్ష్యం నెరవేరడం లేదు.

నూతన పీఓ ఏం చేస్తారో..?

గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు చెందిన వివిధ వస్తువులను భద్రపరిచి భావితరాల వారికి పరిచయం చేసేందుకు ఐటీడీఏ ప్రాంగణంలోనే గిరిజన మ్యూజియం ఏర్పాటు చేశారు. దీనికి పూర్తి స్థాయిలో నిధులు అందకపోవడంతో అరకొరగానే ఆదివాసీ, గిరిజనుల సామగ్రి, వస్తువులు, కళాఖండాలను సేకరిస్తున్నారు. ట్రైబల్ మ్యూజియం, ఆర్ట్ స్కూల్, గిరిజనులు తయారుచేసిన వివిధ వస్తువుల విక్రయాలకు సంబంధించిన కేంద్రాలను భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులు వీక్షించేలా రామాలయ పరిసర ప్రాంతాల్లో లేదా బ్రిడ్జి సెంటర్ – రామాలయం మధ్య దారిలో ఏర్పాటు చేయాలనేది గిరిజనుల ప్రధాన డిమాండ్. ఇందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలంటూ గత పీఓలు రాజీవ్ గాంధీ హనుమంతు, దివ్య రెవెన్యూ అధికారులకు లేఖలు కూడా రాశారు. ఆ ప్రతిపాదనలు సైతం ఫైళ్లకే పరిమతమయ్యాయి. నూతన పీఓ ప్రతీక్ జైన్ అయినా వీటిపై దృష్టి సారించాలని ఆదివాసీ నాయకులు కోరుతున్నారు. ట్రైబల్ మ్యూజియం, ఆర్ట్ స్కూల్‌కు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి: డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర శర్మ

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : పాఠశాల వేళల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, వినియోగించిన వారిపై సస్పెన్షన్ వేటు తప్పదని డీఈఓ సోమశేఖర శర్మ హెచ్చరించారు. అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దమ్మపేట మండలం పట్వారిగూడెం పాఠశాలలో బుధవారం నిర్వహించిన తొలిమెట్టు శిక్షణ శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. తరగతి గదిలో అభ్యసన పేదరికాన్ని నివారించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని, విద్యార్థుల్లో మౌలిక సామర్థ్యాలను పెంపొందించాలని అన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం తొలిమెట్టు, మన ఊరు–మన బడి, ద్విభాషలో పాఠ్య పుస్తకాల వంటి కార్యక్రమాలు అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి.కృష్ణయ్య, కీసర లక్ష్మి, తొలిమెట్టు నోడల్ అధికారి పి.పుల్లయ్య, జగపతి, ఆర్‌పీలు కృష్ణార్జున్‌రావు, మంజుశ్రీ, బుచ్చిరాజు, బాలు, సీఆర్‌పీలు ప్రభాకరాచార్యులు, నాగేశ్వరరావు, సోమరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కొత్తగూడెంటౌన్: కన్న కొడుకును హత్య చేసిన వ్యక్తిని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సీఐ ఎం.కరుణాకర్ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రి ఏరియా గౌతంనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న జమ్ముల రాజయ్య మంగళవారం తెల్లవారు జామున తన కుమారుడు శంకర్‌ను గొడ్డలితో నరికి హతమార్చిన విషయం విదితమే. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు రాజయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

దమ్మపేట: మద్యానికి బానిసైన వ్యక్తి, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొండాయిగూడెం గ్రామానికి చెందిన కూరం వెంకటేశ్వరరావు (45) మద్యానికి బానిసగా మారడంతో భార్య మందలించింది. దీంతో క్షణికావేశానికి లోనై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎర్రగుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షాహీనా తెలిపారు.

వివాహిత అదృశ్యం

దమ్మపేట: వివాహిత అదృశ్యంపై బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని మారప్పగూడెం గ్రామానికి చెందిన పూనెం సుకన్య(30), గత నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. భర్త, కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

సర్పంచ్‌పై దాడి : ముగ్గురిపై కేసు నమోదు

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ సర్పంచ్ చాప ఉమాదేవిపై దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సర్పంచ్ అత్త పెంటమ్మను గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్భాషలాడగా మాట్లాడేందుకు సర్పంచ్ వారిని పిలిపించారు. మాట్లాడుతుండగానే గట్టుపల్లి గోపమ్మ, ఆమె కుమార్తె సౌజన్య, కుమారుడు ప్రసాద్‌లు సర్పంచ్‌పై దాడి చేశారు. దూషించారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

కొండచిలువ కలకలం



కొండ చిలువ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న ఇర్ఫాన్ చికెన్ షాపులోకి ఓ కొండ చిలువ చొరబడి కలకలం సృష్టించింది. షాపు యజమాని సయ్యద్ ఇర్ఫాన్ బుధవారం ఉదయాన్నే షాపు తెరిచి కోళ్లు ఉన్న ఫారమ్‌లోకి వెళ్లగా, కొండ చిలువ కోళ్లను మింగుతూ కనిపించింది. స్థానికుల సమాచారంతో వచ్చిన ఫారెస్ట్ సిబ్బంది సుమారు 12 అడుగుల కొండ చిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచరూరల్: కోడిపుంజులవాగు గ్రామ శివారు జామాయిల్‌తోటలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.36,600, సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు సుమన్, ప్రవీణ్ తెలిపారు.

దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో విద్యుత్ శాఖకు రూ. 2.50 లక్షల నష్టం వాటిల్లింది. అధికారుల గణాంకాల ప్రకారం 215 విద్యుత్ స్తంభాలు, 15 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. భద్రాచలం సబ్ డివిజన్‌లోని బూర్గంపాడులో 9 స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్, మణుగూరు సబ్ డివిజన్‌లోని అశ్వాపురం, పినపాక, మణుగూరు, కరకగూడెం మండలాల్లో 89 స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు, చర్ల సబ్ డివిజన్‌లోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 13 స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. కొత్తగూడెం పట్టణ సబ్ డివిజన్ చుంచుపల్లిలో 2 స్తంభాలు, రూరల్ సబ్ డివిజన్‌లోని జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లిలో 7 స్తంభాలు, లక్ష్మీదేవిపల్లి సబ్‌డివిజన్‌లోని లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, బొమ్మనపల్లిలో 35 స్తంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పాల్వంచ సబ్‌డివిజన్‌లోని పాల్వంచ టౌన్, రూరల్, ములకలపల్లిలో 18 స్తంభాలు, ఇల్లెందు సబ్ డివిజన్ పరిధిలోని ఇల్లెందు టౌన్, రూరల్, గుండాలలో 33 స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు, పలు గ్రామాల్లో 9 స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

కళ్ల కలకతో ఆందోళన వద్దు

- జాగ్రత్తలు తీసుకుంటే త్వరగానే నయం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు
- జిల్లాలో 555 కేసులు నమోదు
- నిత్యం 10 నుంచి 15 మంది బాధితులు



గురుకులంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

భద్రాచలంఅర్బన్/సుజాతనగర్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, ఆ తర్వాత వచ్చిన వరదలు, వాతావరణంలో వచ్చిన మార్పులతో కళ్ల కలక విస్తరిస్తోంది. పిల్లలు, పెద్దలు అందరూ ఇదే సమస్యతో బాధపడుతున్నారు. ఇది సులభంగా ఒకరి నుంచి మరొకరికి సోకుతుందని, చిన్న పిల్లలకు ఇంకా వేగంగా వ్యాప్తిస్తుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 555 మంది కళ్ల కలకతో బాధపడుతుండగా, జిల్లాలోని 29 పీహెచ్‌సీల్లో రోజూ 10 నుంచి 15 కేసులు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సుజాతనగర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవల 50 మంది విద్యార్థులు కళ్ల కలక లక్షణాలతో బాధపడగా, వైద్య సిబ్బంది హెల్త్ క్యాంపు నిర్వహించిన తగిన చికిత్స అందించారు.

బ్యాక్టీరియా, వైరస్‌తో వ్యాప్తి ఎక్కువ

కంటి గుడ్డు చుట్టూ ఉండే తెల్లని పొర, కంటి రెప్ప వెనుక ఉండే పొరను కంజెటైవా అంటారు. దుమ్ము, ధూళి, వేడి, చలి, నీళ్లు వీటిపై ప్రభావం చూపిస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. దీన్నే కళ్ల కలక అంటారు. ఇది బ్యాక్టీరియా, వైరస్‌తో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది.

లక్షణాలు

- కళ్లు ఎర్రబారడం, దురద, కంట్లోంచి నీరు కారడం.
- కంటి రెప్పలు ఉబ్బిపోయి, రాత్రి నిద్రపోయినప్పుడు అతుక్కొనిపోతాయి, ఊసులు వస్తాయి.
- సాధారణ కళ్ల కలక వస్తే వారంపాటు ఇబ్బంది పెట్టిన తర్వాత తగ్గిపోతుంది.
- వైరస్‌తో కళ్ల కలక వస్తే మూడు వారాల పాటు ఉండొచ్చు.
- ఇంట్లో ఒకరికి వస్తే ఒకటి రెండు రోజుల్లో అందరికీ వ్యాపించే అవకాశం ఉంటుంది.

అపోహలు వద్దు



కళ్ల కలక వచ్చినా ఎలాంటి ఆందోళన, అపోహలు పెట్టుకోవద్దు. జాగ్రత్తలు పాటిస్తే త్వరగానే నయం అవుతుంది. కలక వచ్చిన వారు శుభ్రమైన టవల్స్‌తో తుడుచుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వైరస్‌లు దరిచేరవు. కలకసోకినవారు కళ్లద్దాలు ధరిస్తే ఇతరులకు వ్యాప్తి చెందదు.

– డాక్టర్ సంతోష్, కంటి వైద్య నిపుణుడు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

అందుబాటులో మందులు



జిల్లాలో ఇప్పటివరకు 555 కళ్ల కలక కేసులు నమోదయ్యాయి. వీటిలో అధికంగా 60 కేసులు రామవరంలోనే ఉన్నాయి. ఇందుకు సంబంధించిన మందులు అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచాం. పాఠశాలలు, హాస్టళ్లలో ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలి.

– డా. లక్ష్మీశిరీష, డీఎంహెచ్‌ఓ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కళ్ల కలక వ్యాపించకుండా ఉండాలంటే రద్దీ ప్రదేశాల్లో సంచరించవద్దు. ప్రయాణ సమయంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. మురికిగా ఉండే చేతులతో కళ్లను తాకొద్దు. పబ్లిక్ ప్లేసుల్లో చేతులతో తాకితే తప్పనిసరిగా హ్యాండ్ శానిటైజర్‌తో శుభ్రంగా కడుక్కోవాలి. ద్విచక్రవాహనదారులు సేఫ్టీ గ్లాసెస్ ధరించాలి. కలక ఉన్నవారికి దూరంగా ఉండాలి. వారు వాడిన వస్తువులను తాకొద్దు. కలక సోకిన వారు ఇంట్లోనే ఉండాలి. దురదగా అనిపించినా కళ్లపై రుద్ద కూడదు. శుభ్రంగా కళ్లను కడుక్కోవడంతోపాటు శుభ్రమైన కాటన్ క్లాత్, టిష్యూ పేపర్ వాడాలి. వైద్యులు సూచించినట్లుగా యాంటీ బయాటిక్, లూబ్రికెంట్‌ఐ డ్రాప్స్ వాడాలి.

మా సమస్యలు పరిష్కరించాలి

ఎస్పీని కలిసి విన్నవించిన హోంగార్డులు



ఎస్పీ వినీత్‌కు వినతిపత్రం ఇస్తున్న హోంగార్డ్స్ అసోసియేషన్ నాయకులు

కొత్తగూడెంటౌన్: హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్పీ డాక్టర్ వినీత్‌కు బుధవారం హోంగార్డ్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ హోంగార్డులను పర్మనెంట్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ జాప్యం చేయకుండా అందించాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు జి.వీరయ్య, ఎస్‌వి రావు, వంశీ, సామ్యూల్, జి.శ్రీనివాసరావు, ప్రవీణ్, సైదులు, బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఎఫ్‌బీఓ క్వార్టర్స్ ప్రారంభోత్సవం!

అటవీ శాఖ తీరుపై ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల ఆగ్రహం



వివాదానికి కారణమైన ఎఫ్‌బీఓ క్వార్టర్ల భవనం

అశ్వారావుపేటరూరల్: అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎఫ్‌బీఓ క్వార్టర్స్ ప్రారంభోత్సవం వివాదాస్పదంగా మారింది. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోగల కావడిగుండ్ల ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని కంట్లం వద్ద సుమారు రూ.30 లక్షలతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ క్వార్టర్లను నిర్మించారు. భవన నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం స్థానిక అటవీ శాఖ అధికారులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయగా, కొత్తగూడెం సీసీఎఫ్ భీమా నాయక్, ఎఫ్‌డీఓ తిరుమలరావు ప్రారంభించారు. రహస్యంగా ప్రారంభించడంతోపాటు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, పంచాయతీ సర్పంచ్, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం వివాదానికి కారణమైంది. దీంతో ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ, సర్పంచ్‌లు అటవీశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా భవనాన్ని ప్రారంభించలేదని, పరిశీలించామని అటవీశాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో కిష్టాగౌడ్, రేంజర్ కరుణాకర్ చారి, ఎఫ్ఎస్ఓలు పాల్గొన్నారు.

8 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పరితోష్ పంకజ్
- నిందితులపై ఉపా చట్టం కింద కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు

భద్రాచలంఅర్బన్: ఎనిమిది మంది మావోయిస్టు మిలీషియా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్ బుధవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. రెండేళ్లుగా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో పామేడ్ ఏరియా కమిటీ పరిధిలో కంచాల రాసపల్లి ఆర్పిసి మిలీషియా కమిటీ సభ్యులుగా పనిచేస్తున్న మడకం భద్ర, మడకం జోగ, మడివి సన్న, మడివి భీమ, మడివి అంద, మడివి భీమ, కల్మ దూల, కల్మ హడమలు పట్టుబడినట్లు తెలిపారు. చర్ల మండలంలోని గోరుకొండ, చెన్నాపురం గ్రామాల మధ్య బీటీ రోడ్డులో పోలీసులను చంపాలనే ఉద్దేశంతో సుమారు 12 కేజీల మందు పాతరను అమర్చిన ఘటనలో వీరు నిందితులని పేర్కొన్నారు. ఆ పాతరను గత నెల 25న చర్ల, స్పెషల్ పార్టీ, 81 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టి, గుర్తించి నిర్వీర్యం చేశారని తెలిపారు. ఎనిమిది మందిపై చర్ల పోలీస్ స్టేషన్‌లో పేలుడు పదార్థాల చట్టం, ఉపా చట్టంతోపాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, భద్రాచలం కోర్టులో రిమాండ్ చేశామని వివరించారు. మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాల పేరుతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో ఆదివాసీలను మీటింగుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మీటింగ్‌కు హాజరుకాని ఇంటికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో అసిస్టెంట్ కమాండెంట్లు సునీల్ కుమార్, శేషగిరిరావు, సెకండ్ ఇన్ కమాండెంట్ ప్రీతసి, చర్ల సీఐ అశోక్, ఎస్ఐ టీవీవీ సూరి తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో నవవధువు మృతి
- భర్త, అత్తామామలకు తీవ్రగాయాలు
- ఉల్వనూరు, ముత్తగూడెం గ్రామాల్లో విషాదం



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న నిత్యావసరాలు

పాల్వంచరూరల్: రెండు నెలల క్రితం వివాహమైంది. బతుకుదెరువు కోసం భాగ్యనగరం వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొని నవ వధువు మృతి చెందింది. భర్త, అత్త, మామలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం కుందారం సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన అంబడి ప్రశాంత్‌కు ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన సింధూజ(23)తో గత జూన్ 8న వివాహం జరిగింది. కారు నడుపుతూ జీవనం సాగిస్తున్న ప్రశాంత్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి క్యాబ్ నడుపుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవల భార్యతోపాటు తల్లిదండ్రులు శ్రీనివాస్, నాగమణి తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి, అద్దెకు ఇల్లు తీసుకుని వచ్చాడు. మంగళవారం రాత్రి ఉల్వనూరులో ఇంటికి తాళంవేసి నలుగురూ కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో జనగామ జిల్లా పాలకుర్తిరోడ్‌లోని కుందారం సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో సింధూజ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రశాంత్, అతని తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

వివాహమై రెండు నెలలు కాకముందే..



భర్తతో మృతురాలు సింధూజ (ఫైల్)

ప్రశాంత్, సింధూజకు వివాహం జరిగి రెండు నెలలు కూడా పూర్తిగా నిండలేదు. ఇక్కడ బతుకుదెరువు లేకపోడంతో హైదరాబాద్ వెళ్లి కారు క్యాబ్ నడుపుకునేందుకు కుటుంబం అంతా బయల్దేరారు. అవసరమైన నిత్యావసర వస్తువులు బియ్యం, ఉప్పు, కారం, పచ్చళ్లు, కుట్టు మిషన్ వంటి సామగ్రి వెంట తీసుకెళ్తున్నారు. ప్రమాదస్థలిలో నిత్యావసర వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిఉన్న తీరు చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. వివాహం జరిగిన రెండు నెలలు కాకముందే సింధూజ మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. ఉల్వనూరు, ముత్తగూడెం గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఆటో ఢీకొని ఒకరు మృతి



రహదారి పక్కకు దూసుకెళ్లిన ఆటో, క్షతగాత్రులు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి వద్ద బుధవారం కొత్తూరు గ్రామానికి చెందిన కాలం నర్సింహారావు(42) చింతగుంపు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పాల్వంచ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ప్రమాదంపై ఇంకా కేసు నమోదు కాలేదని ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఆటో, కారు ఢీ : ఇద్దరికి గాయాలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని రంగాపురం వద్ద భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న కారు, పాల్వంచ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న ఆటో ఢీకొన్నాయి. దీంతో ఆటో రోడ్డ పక్కకు దూసుకెళ్లి, బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న దమ్ము శ్రీను, శారదలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వీడని జంట హత్యల మిస్టరీ..

సత్తుపల్లి: వృద్ధురాలు, దివ్యాంగుడైన ఆమె కుమారుడిని అతికిరాతంగా హత్య చేయగా.. మిస్టరీ ఇంకా వీడలేదు. హత్యోదంతం నుంచి మండలంలోని నారాయణపురం వాసులు కోలుకోలేదు. ఎవరిని కదిలించినా ఈ ఘటనపై ఆరా తీస్తుండటం కనిపించింది. వృద్ధురాలైన మృతురాలు రాయల తులశమ్మ, తన కుమారుడు దివ్యాంగుడైన సత్యనారాయణతో కలిసి నివసిస్తోంది. అయితే, వీరిద్దరినీ సోమవారం అర్ధరాత్రి గొంతు కోసి హత్య చేయగా, మంగళవారం విషయం వెలుగుచూసిన విషయం విదితమే. కాగా, పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టి అనుమానితుల కదలికలపై ఆరా తీస్తున్నారు.

సత్తుపల్లి నుంచి ఆటోలో వచ్చి..

తులశమ్మ తన కుమారుడైన సత్యనారాయణ(చంటి)తో కలిసి సోమవారం సత్తుపల్లి బ్యాంక్‌లో రూ.21 వేలు నగదు డ్రా చేసినట్టు తెలిసింది. సత్తుపల్లిలోనే బియ్యం, సరుకులు కొనుగోలు చేసి ప్రత్యేకంగా ఆటో మాట్లాడుకుని గ్రామానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం పెద్దకోడలు చిట్టెమ్మను పిలిచి రూ.11,500 ఇచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటి పరిసరాల్లో కనిపించిన ఆమె బంధువులతో ఫోన్‌లో కూడా మాట్లాడినట్టు సమాచారం.

ఒక్కరితోనే సాధ్యం కాదు..

హత్య జరిగిన తీరు, పరిసరాలను పరిశీలిస్తే జంట హత్యలు చేసింది ఒకరు కాదని.. మరికొందరి సహకారం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తులశమ్మ ఎన్ని డబ్బులైనా తనతోనే ఉంచుకుంటుందే తప్ప ఇంట్లో కూడా భద్రపర్చదని స్థానికులు చెబుతున్నారు. కాగా, హత్య జరిగాక ఆమె వద్ద డబ్బు, మెడలోని బంగారం నాన్‌తాడు కనిపించకపోవటంతో వీటికోసం హత్యలు జరిగినట్లు భావిస్తున్నారు. .జంట హత్యలు పోలీసులకు సవాల్‌గా మారగా.. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో క్షణ్ణంగా పరిశీలించి ఆధారాలను సేకరించారు. కల్లూరు ఏసీపీ బి.రామానుజం పర్యవేక్షణలో పట్టణ సీఐ మోహన్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యర్థులను ఎంపిక చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆధ్వర్యంలో నేర్పించే స్వయం ఉపాధి కోర్సులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయాలని డీజీఎం పర్సనల్ కోడూరు శ్రీనివాసరావు సూచించారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగులకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రీ ప్రైమరీ టీచర్ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులకు అభ్యర్థులన ఎంపిక చేయాలని సూచించారు. అధికారులు, కోఆర్డినేటర్లు కె. శివకుమార్, షరీఫ్, మునీల, పుష్ప, లత, రమాదేవి, హిమబిందు, అరుణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టుకు హాజరుకండి..

– ఖమ్మం వైద్యుడికి నోటీసులు జారీ

కొత్తగూడెంటౌన్: సాక్ష్యాలు సమర్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడిని కోర్టులో హాజరుకావాలని ఆదేశిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏన్కూరు మండలం తూతకలింగన్నపేటకు చెందిన ఆల్ల లక్ష్మి 2021, మార్చి 21న వాహన ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని సురక్ష హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంది. ఆ తర్వాత నష్టపరిహారం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేసు వేసింది. అయితే, కేసు విచారణలో వైద్యుడి సాక్ష్యం అవసరం కావడంతో కోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ఈమేరకు కమిషనర్‌గా నియమితులైన ఉప్పు అరుణ సురక్ష ఆస్పత్రి మేనేజర్ సైదులుకు సమాచారం ఇచ్చి ఆయన సూచనతో గతనెల 17న ఆస్పత్రికి వెళ్లగా.. దూషించారని, మళ్లీ 3గంటలకు వచ్చి మాట్లాడి వెళ్లిపోవడంతోపాటు సాయంత్రం వస్తానని చెప్పినా సాక్ష్యం పూర్తిగా ఇవ్వలేదని ఆమె కోర్టుకు నివేదిక ఇచ్చారు. దీంతో విచారణకు సహకరించలేదని భావిస్తూ వైద్యుడిని ఈనెల 17వ తేదీన స్వయంగా కోర్టులో హాజరుకావాలని ఆదేశిస్తూ జడ్జి నోటీసు జారీ చేశారు.

డెంగీ కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం తిరుమలకుంట కాలనీలో బుధవారం డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన యువకుడు కుర్సం నాగు కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. వినాయకపురం పీహెచ్‌సీకి రాగా సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. దీంతో డెంగ్యూ జ్వరంగా తేలింది. పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. మురుగు గుంతల్లో దోమల నివారణ మందును చల్లించారు. ఆయిల్‌బాల్స్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఈఓ రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది విజయ్‌రెడ్డి, సత్యనారాయణ, ఏఎన్ఎంలు ఉన్నారు.

ఇద్దరికి నాలుగేళ్ల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: వివాహిత మృతికి కారణమైన ఆమె భర్తతోపాటు మరో మహిళకు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ. 4000 జరిమానా విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి.భానుమతి బుధవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం పట్టణం న్యూగొల్లగూడేనికి చెందిన బండారి కృష్ణవేణి, బండారి శ్రీనివాస్‌లకు 20 ఏళ్ల క్రితం పెళ్లికాగా వారికి రవికిరణ్, రోజారాణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే ప్రాంతంలో ఉంటున్న బోసే శారదతో బండారి శ్రీనివాస్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న క్రమంలో గొడవలు జరిగాయి. 19 మే 2017న కూడా గొడవ జరిగింది. ఆ సమయంలో శారద కృష్ణవేణిని దూషించింది. దీంతో మనస్తాపం చెందిన కృష్ణవేణి అదే రోజు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జడ్జి 14 మంది సాక్షులను విచారించగా శారద, శ్రీనివాస్‌పై నేరం రుజువు కావడంతో ఇద్దరికీ నాలుగేళ్ల జైలుశిక్షతోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మీరా ఫిర్దోశ్ వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ బి.రవి సహకరించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌కు చెందిన ప్రమీల ఫిర్యాదు మేరకు ఆమె భర్త వెంకటేశ్వర్లుపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ కరుణాకర్ బుధవారం వివరాలు వెల్లడించారు.

సింగరేణిలో ఇనుము చోరీ

సింగరేణి ఇల్లెందు ఏరియాలో బుధవారం రూ.6 వేల విలువైన ఇనుము చోరీకి గురైనట్లు సింగరేణి ఎస్అండ్‌పీసీ విభాగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

క్లుప్తంగా...

చెరువుల నుంచి మట్టి తవ్వకం అక్రమమే

ఉద్దండాపూర్‌పై పిటిషన్‌లో ఎన్జీటీ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్‌: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్‌ రిజర్వాయర్‌ కట్ట నిర్మాణం కోసం చెరువుల్లోని మట్టిని పెద్దఎత్తున తవ్వి తరలించడం అక్రమేనని నేషనల్‌ గ్రీన్‌ ట్రిబ్యునల్‌ (ఎన్జీటీ) తేల్చింది. అది పర్యావరణ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. తవ్విన మట్టిని అంచనా వేసి జరిమానాను లెక్కించాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ జరిమానాను కృష్ణా నదీ మేనేజ్‌మెంట్‌ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. దీని కోసం 4 వారాలు గడువిస్తున్నట్లు పేర్కొంది. పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్‌ స్కీమ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఉద్దండాపూర్‌ రిజర్వాయర్‌ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే అత్యంత పొడవైన ఈ రిజర్వాయర్‌ నిర్మాణానికి పర్యావరణ అనుమతి లేకున్నా చుట్టు పక్కల ఉన్న చెరువుల నుంచి విచక్షణా రహితంగా మట్టిని తవ్వి కట్ట నిర్మాణానికి తరలిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌ జిల్లా ముదిరెడ్డిపల్లెకు చెందిన కోస్గీ వెంకటయ్య ఎన్జీటీలో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై జ్యుడీషియల్‌ సభ్యులు జస్టిస్‌ పుష్ప సత్యనారాయణ, ఎక్స్‌పర్ట్‌ సభ్యులు సత్యగోపాల్‌ కొర్లపాటి బెంచ్‌ విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది శ్రవణ్‌ కుమార్‌ వాదనలు వినిపించారు. 'మట్టిని విచక్షణారహితంగా తవ్వితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుంది. భూగర్భ జలాలు ప్రతికూలంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షపు నీరు పూర్తిగా ఖాళీ అయిన తర్వాత భూగర్భ జలాలు మరింత కిందకు పడిపోతాయి. ఆ మట్టిని అనుమతి లేకుండా కట్ట నిర్మాణానికి ఉపయోగించడం చట్టవిరుద్ధం. వెంటనే తవ్వకాలను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలి'అని వాదించారు. వాదనలు పూర్తి కావడంతో జస్టిస్‌ పుష్ప తీర్పు వెల్లడించారు.

ఏపీ బీసీ యూత్‌ అసోసియేషన్‌ కార్యదర్శిగా శివకుమార్‌

లక్డీకాపూల్‌ (హైదరాబాద్‌): తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన పి.శివకుమార్‌ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర బీసీ యూత్‌ అసోసియేషన్‌ కార్యదర్శిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్‌.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్‌ యూత్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ (నాని ముదిరాజ్‌) తెలిపారు.

మేం చెప్పిందే చట్టం!

ప్రభుత్వం తమదంటూ అధికారులను బెదిరించిన 'నారాయణ'

- బినామీలు, బంధువుల పేరిట భారీగా అసైన్డ్‌ భూములు కాజేశారు
- బినామీల పేరిట కొన్న 148 ఎకరాల ప్రస్తుత మార్కెట్‌ విలువ రూ.600 కోట్లకుపైనే
- నారాయణ, ఆయన కుమార్తె ఫోన్‌ సంభాషణల్లో ఈ వ్యవహారం బయటపడింది
- చంద్రబాబుకు సైతం భాగస్వామ్యం.. ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు అవసరం
- స్టే ఎత్తివేసి దర్యాప్తునకు అనుమతివ్వండి.. హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో నిరుపేద అసైన్డ్‌దారులను బెదిరించి బినామీలు, బంధువుల పేరిట కారుచౌకగా భూములను కొట్టేసిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను సైతం బెదిరించారని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్‌ జనరల్‌ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు బుధవారం నివేదించారు. ప్రభుత్వం తమదని, తాము చెప్పిందే చట్టమని, చెప్పినట్లు చేయాలంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అప్పటి అడ్వొకేట్‌ జనరల్‌ (ఏజీ), న్యాయశాఖ, ముఖ్య కార్యదర్శులు, ఐఏఎస్‌ అధికారులు వారించినా నారాయణ లెక్క చేయలేదని తెలిపారు. అసైన్డ్‌ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో నారాయణే కీలక సూత్రధారి అని స్పష్టం చేశారు. ఆయన సమీప బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలను కొనుగోలు చేసేందుకు రూ.18.10 కోట్లు వెచ్చించినట్లు నివేదించారు. ప్రస్తుతం వాటి మార్కెట్‌ విలువ రూ.600 కోట్లకు పైనే ఉంటుందని కోర్టు దృష్టికి తెచ్చారు. అసైన్డ్‌ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, అంతిమంగా పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరదంటూ గత ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు భయాందోళనలు రేకెత్తించారన్నారు. అనంతరం అసైన్డ్‌దారుల నుంచి భూములను అన్‌ రిజిస్టర్డ్‌ సేల్‌ అగ్రిమెంట్ల ద్వారా నామమాత్రపు ధరలకు కొట్టేశారని వివరించారు. ఆ తరువాత వాటిని ల్యాండ్‌ పూలింగ్‌ స్కీం కింద సీఆర్‌డీఏకు ఇచ్చి జీవో 41 (ల్యాండ్‌ పూలింగ్‌ స్కీం రూల్స్‌)ని అడ్డం పెట్టుకుని విలువైన నివాస, వాణిజ్య ప్లాట్లను పొందినట్లు తెలిపారు. కొన్నిటిని అధిక ధరలకు అమ్ము



కున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ మొత్తం నేరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నాటి పురపాలక శాఖ మంత్రి నారాయణ పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయని నివేదించారు. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న నారాయణ ఫోన్‌లో ఆయన కుమార్తె సింధూరతో జరిపిన కీలక సంభాషణలున్నట్లు తెలిపారు. తాను అసైన్డ్‌ భూములను కొన్నట్లు ఆ సంభాషణల్లో నారాయణ అంగీకరించారని వెల్లడించారు. అసైన్డ్‌ భూములు తమ పేర్లతో ఉంటే ప్రభుత్వం జైల్లో వేస్తుందని నారాయణ తన కుమార్తెతో చెప్పారన్నారు. ఆ సంభాషణల తాలుకూ పెన్‌ డ్రైవ్‌ను సీల్డ్‌ కవర్‌లో కోర్టుకు అందచేశారు. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఒరిజినల్‌ రికార్డులను సైతం సీల్డ్‌ కవర్‌లో కోర్టుకు సమర్పించారు. సుధాకర్‌రెడ్డి వాదనలు పూర్తి కాకపోవడంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ డాక్టర్‌ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. అసైన్డ్‌ భూముల బదలాయింపులో అక్రమాలపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి పొంగూరు నారాయణలపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీన్ని కొట్టివేయాలని కోరుతూ వేర్వేరుగా దాఖలైన క్వాష్‌ పిటిషన్లపై స్టే విధించిన న్యాయస్థానం ఇటీవల తుది విచారణ చేపట్టింది.

ఇతర టీడీపీ నేతలు కూడా..

అసైన్డ్‌దారులను బెదిరించి కేవలం నారాయణ మాత్రమే కాకుండా అప్పటి అధికార పార్టీ నేతలైన రావెల కిషోర్‌బాబు, అనగాని సత్యప్రసాద్, పరిటాల శ్రీరామ్, ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు కూడా భూములను సొంతం చేసుకున్నట్లు ఏఏజీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ల్యాండ్‌ పూలింగ్‌ పరిధిలోకి అసైన్డ్‌ భూములను తీసుకురావడం, ఆ భూముల బదలాయింపుపై అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్‌ కాంతీలాల్‌ దండే, జాయింట్‌ కలెక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌ అభ్యంతరం తెలిపారన్నారు. ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌ సైతం అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అసైన్డ్‌ భూముల విషయంలో చట్టపరమైన నిబంధనలను నారాయణకు స్పష్టంగా వివరించినట్లు వారు తమ వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో స్టే ఎత్తివేసి సీఐడీ దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతి నివ్వాలని అభ్యర్థించారు.

చట్టపరమైన రక్షణ ఉంది.. ప్రాసిక్యూషన్‌ తగదు

అంతకు ముందు నారాయణ తరఫున సీనియర్‌ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌ వాదనలు వినిపిస్తూ సీఆర్‌డీఏ చట్టం కింద తీసుకున్న నిర్ణయాల విషయంలో ప్రభుత్వం, అధికారులు, అథారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి కేసులు దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. చట్టం కింద రక్షణ ఉన్నందున నారాయణను ప్రాసిక్యూట్‌ చేయడానికి వీల్లేదన్నారు. తమకున్న అధికారం మేరకే జీవో 41 జారీ చేశారని తెలిపారు. ఈ అధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేదన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునే వారికి దురుద్దేశాలు అంటగట్టడానికి వీల్లేదన్నారు. అసైన్డ్‌ భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీలెవరూ ఫిర్యాదుదారులు కాదన్నారు. అందువల్ల ఆ చట్టం కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదన్నారు.

భారీ స్కామ్‌.. 'బ్రో'

- అమెరికాలో బాబు ముఠా వసూలు చేసిన డబ్బునే పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారు: అంబటి
- చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నట్లు అంబటి వెల్లడి

సాక్షి, అమరావతి: బ్రో సినిమా వ్యవహారంలో నూటికి నూరు శాతం అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అదో కుంభకోణమని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. తన ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే సినీ మా నిర్మాతగానీ పవన్‌ కల్యాణ్‌గానీ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వాస్తవాలు వెల్లడించేందుకు భయపడుతున్నారా? దాస్తున్నా రా? అని నిలదీశారు. దాస్తున్నారంటే అందులో స్కామ్‌ దాగి ఉందనే అర్థమని స్పష్టం చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అమెరికాలో తన ముఠా ద్వారా వసూలు చేసిన డబ్బును నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ ద్వారా పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారని పునరుద్ఘాటించారు.



డైలాగ్‌లు కొట్టే దాగుడు మూతలెందుకు?

బ్రో సినిమాకు విదేశీ పెట్టుబడులు అక్రమంగా వచ్చాయని, ఇది మనీలాండరింగ్‌ కాదా? అని అంబటి సూటిగా ప్రశ్నించారు. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడి ఎంత? కలెక్షన్లు ఎంత? పవన్‌ పారితోషికం ఎంత? ఆదాయ పన్నుగా కట్టింది ఎంత? అని ప్రశ్నించారు. అత్యంత నిజాయితీపరుడినని, అపర దాన కర్ణుడినని, సమాజ శ్రేయస్సు కోరుకునే వ్యక్తినంటూ డైలాగ్‌లు కొట్టే పవన్‌ వాస్తవాలను ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. సినిమాను సినిమాలాగే చూడాలన్న సాయి ధరమ్‌ తేజ్‌ వ్యాఖ్యలపై మంత్రి అంబటి స్పందిస్తూ అలాంటప్పుడు సినిమాలను సినిమాగానే తీయండి...మధ్యలో మమ్మల్ని గోకడమెందుకు? అని చురకలంటించారు. బ్రో సినిమా వ్యవహారంలో మనీలాండరింగ్‌ జరిగిందంటూ ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా 'నేను ఇవాళ రాత్రి చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నా. మా పార్టీ ఎంపీలను కలుస్తా. ఢిల్లీ నుంచి వచ్చాక అన్ని వివరాలు చెబుతా'అని అంబటి చెప్పారు.

వృద్ధాప్యంలోనూ అనుమానంతో వేధిస్తున్నాడని..

- భర్త హత్యకు భార్య సుపారీ
- రూ. రెండు లక్షలు తీసుకొని హతమార్చిన ఇద్దరు
- ఆలస్యంగా ఘటన వెలుగులోకి...



మృతదేహాన్ని వెలికితీస్తున్న అధికారులు. ఇన్‌సెట్లో కాశయ్య (ఫైల్‌)

సిరిసిల్లక్రైం: వృద్ధాప్యంలోనూ కట్టుకున్న భార్యను అనుమానించాడు. భర్త పదేపదే కొట్టడంతో విసిగిపోయింది. ఎలాగైనా తన భర్తను హతమార్చాలని రూ.రెండు లక్షలకు సుపారీ ఇచ్చింది. గత నెల 13వ తేదీన హత్య జరగ్గా, బుధవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామానికి చెందిన కనకవ్వ(60), కాశయ్య(65) బతుకుదెరువుకు సిరిసిల్లకు 25 ఏళ్ల క్రితం వచ్చారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కూతుళ్లకు పెళ్లిళ్లు జరగగా, కొడుకు మానసిక స్థితి సరిగ్గా లేదు. వృద్ధ దంపతులిద్దరూ సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తారు. ఈ క్రమంలోనే భార్యపై భర్తకు అనుమానం కలిగింది. పలుమార్లు కనకవ్వను కొట్టాడు. ఆమె భర్త వేధింపులు తట్టుకోలేకపోయింది. వరుసకు తమ్మునిగా పిలిచే ఒకరికి విషయాన్ని చెప్పింది. భర్తను చంపితే రూ.2లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంది. గత నెల 13న మద్యం మత్తులో కాశయ్య నిద్రిస్తుండగా, అనుకున్న పథకం ప్రకారం తను సంప్రదించిన వారికి సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని నిద్రలో ఉన్న కాశయ్య గొంతుకు దుప్పటి చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. మృతదేహాన్ని కారులో వేసుకొని సిరిసిల్లలోని మానేరు వాగు చెక్‌డ్యామ్‌ వద్ద బొందలగడ్డలో పూడ్చిపెట్టారు. ఆ తర్వాత రూ.2 లక్షలు తీసుకుని వెళ్లిపోయారు.

డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్‌

చంపడానికి చేసుకున్న ఒప్పందంతోపాటు హత్య చేసిన విధానాన్ని నిందితుల్లో ఒకరు వీడియో తీసినట్టు తెలిసింది. హత్య చేసిన తర్వాత వచ్చిన రూ.2లక్షలతో జల్సాలు చేసే సమయంలో మరో రూ.లక్ష కావాలంటూ కనకవ్వను డిమాండ్‌ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే హత్యకు సంబంధించిన వీడియో బయటపెడతామని బెదిరించసాగారు. ఈ తతంగమంతా బయటకు పొక్కింది. దీనిపై సిరిసిల్లటౌన్‌ సీఐ ఉపేందర్‌ విచారణ చేపట్టారు. కూరగాయల మార్కెట్‌ ఏరియాలో నిఘా పెట్టి అనుమానితుల నుంచి సమాచారం సేకరించారు. చివరికి వృద్ధుడి హత్య చేయడానికి సుపారీ తీసుకున్న ఇద్దరు నిందితులతోపాటు మృతుని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. బొందలగడ్డలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దార్‌ సమక్షంలో బయటకు తీయించారు. ఈ విషయంపై సిరిసిల్లటౌన్‌ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని, వివరాలు ఉన్నతాధికారుల సమక్షంలో వెల్లడిస్తామని తెలిపారు.

82.92 లక్షల ఎకరాల్లో పంటల సాగు

అందులో 43.25 లక్షల ఎకరాల్లో పత్తి
- 25.52 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పంటల సాగు ఊపందుకుంది. భారీ వర్షాలు కురవడంతో ఒకవైపు పంట నష్టం జరిగినా, మరోవైపు రైతులు వరి నాట్లు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 82.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో వెల్లడించింది. ఈ సీజన్‌ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 66.72% విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 43.25 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 25.52 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.80 లక్షల ఎకరాల్లో, సోయాబీన్‌ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 4.26 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.51 లక్షల ఎకరాల్లో సాగైంది.

జిల్లా వార్తలు

రేపు సీపీఆర్‌ఎంఎస్‌–ఎన్‌ఈ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా కాంట్రిబ్యూటరీ పోస్ట్‌ రిటైర్‌మెంట్‌ మెడికల్‌ స్కీమ్‌ (నాన్‌ ఎగ్జిక్యూటివ్‌) సీసీఆర్‌ఎంఎస్‌–ఎన్‌ఈ బోర్డ్‌ సమావేశం శుక్రవారం కోల్‌కతాలో జరగనుందని ఏబీకేఎంఎస్‌–బీఎంఎస్‌ జాతీయ కార్యదర్శి పి.మాధవ్‌నాయక్‌ తెలిపారు. సమావేశం నిర్వహించాలని కోలిండియా యాజమాన్యానికి లేఖ రాయడంతో తేదీ ఖరారు చేశారని చెప్పారు. సమావేశానికి బీఎంఎస్‌ తరఫున తాను హాజరుకానుండగా, బొగ్గుగని కార్మికులకు ఉద్యోగ విరమణ తర్వాత వైద్యసౌకర్యం, బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అపరాల పంటలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రుక్మిణీదేవి

ఎర్రుపాలెం: అపరాల పంటలైన కంది, పెసర, మినుముపై రైతులు దృష్టి సారించాలని మధిర వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్‌ కె.రుక్మిణీదేవి సూచించారు. ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెంలో బుధవారం అపరాల పంటల సాగులో నూతన సాంకేతిక విధానాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అపరాల పంటల సాగుతో కలిగే లాభాలను వివరించాక పలువురు రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్‌ .భరత్, ఝాన్సీరాణి, కె.నాగస్వాతి, ఏఈఓ సుష్మ పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో మణికట్టు ఆపరేషన్‌

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో చేతి మణికట్టు ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. జీవీఆర్‌ ఓసీలో విధులు నిర్వర్తిస్తున్న భీమయ్య కుమారుడు అభిలాష్‌కు ఇటీవల జరిగిన ప్రమాదంలో పడి రెండు చేతుల మణికట్టు వద్ద ఎముకలు విరిగాయి. దీంతో సింగరేణి ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు ఆపరేషన్‌ చేయడంతో ఆయన కోలుకుంటున్నాడు. ఈ సందర్భంగా ఆర్థో సర్జన్‌ సువర్ణ, ఏసీఎంఓ సుజాతను టీబీజీకేఎస్‌ నాయకులు రజాక్, కూసన వీరభద్రయ్య, నిమ్మల రాజేశ్వరరావు, చిలక రాజయ్య, పోశం శ్రీనివాస్, అనిల్, భరత్, సాగర్‌ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సేవల్లో మరింత వేగం

ఉమ్మడి జిల్లాకు చేరిన 108, 102 వాహనాలు

ఖమ్మంవైద్యవిభాగం: క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడమే కాక గర్భిణులు, బాలింతలను ఆస్పత్రులకు తీసుకొచ్చి ఇళ్లకు చేర్చే 102 వాహనాలు కొత్తవి అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఉన్న వాహనాలు పాతబడిపోవడంతో తరచుగా మొరాయిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 466 కొత్త వాహనాలు కొనుగోలు చేయగా వీటిని మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రారంభించారు. ఇందులో నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 38 వాహనాలు కేటాయించారు. వాటిలో 32 కొత్త వాహనాలు జిల్లాకు చేరగా, సెంటర్లకు పంపించారు. మిగతా ఆరు వాహనాలు రెండు, మూడు రోజుల్లో చేరుకుంటాయని 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్‌ మేనేజర్‌ భూమా నాగేందర్‌ తెలిపారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 108 వాహనాల్లో భద్రాద్రి కొత్తగూడెంనకు 11, ఖమ్మం జిల్లాకు ఎనిమిది పంపించగా, 102 వాహనాలు భద్రాద్రి కొత్తగూడెంనకు పది, ఖమ్మం జిల్లాకు 8 కేటాయించినట్లు వెల్లడించారు. అలాగే, భద్రాద్రి జిల్లాకు ఒక పార్థీవ వాహనం వచ్చిందని తెలిపారు. నూతన వాహనాల రాకతో అత్యవసర వైద్య సేవలు మరింత మెరుగు పడతాయని, క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించే సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.





ఖమ్మం జనరల్‌ ఆస్పత్రిలో 108 నూతన వాహనం (ఇన్‌సెట్‌) 102 నూతన వాహనం

నేలరాలిన నిరుపేద కుసుమం

- ఉపాధి బాటలో లారీ ఢీకొనడంతో మృతి
- ఖమ్మంలో కన్నుమూసిన మానుకోట జిల్లా యువతి



శ్రీకన్య (ఫైల్‌)

ఖమ్మంక్రైం: కూలి పనిచేస్తున్న తల్లిదండ్రులకు సోదరుడితోపాటు తాను కూడా చేదోడుగా నిలవాలని భావించిన ఆ యువతి స్వగ్రామాన్ని వదిలి ఖమ్మంకు చేరుకుంది. ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు ఆమె ఆసరాగా నిలుస్తుండగా.. విధి వక్రీకరించి మృత్యువు దరిచేర్చింది. ఖమ్మంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందగా వివరాలను టూటౌన్‌ పోలీసులు వెల్లడించారు. మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం నీలికుర్తికి చెందిన పాక శ్రీకన్య (28) వైరాలోని ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీలో పనిచేస్తూ ఖమ్మం రాపర్తి నగర్‌లో నివాసముంటోంది. ప్రతిరోజు తన స్కూటీపై మరో యువతి మాలోతు రాణితో కలిసి వైరా వెళ్లివస్తోంది. రోజులాగే వీరిద్దరు బుధవారం వైరాకు వెళ్తుండగా శ్రీశ్రీ సర్కిల్‌ వద్ద వైరా నుంచి వరంగల్‌ వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న శ్రీకన్య అక్కడికక్కడే మృతి చెందగా, వెనుకాల కూర్చున్న రాణికి తీవ్రగాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్‌ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు యువతి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శ్రీకన్య బీఈడీ పూర్తిచేసి ఐదేళ్లుగా గ్యాస్‌ ఏజెన్సీలో పనిచేస్తోంది. ఆమె మృతి చెందిన సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఈశ్వరమ్మ–భిక్షం ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదిస్తుండటం అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, యువతిని ఢీకొట్టిన లారీడ్రైవర్‌ ఆపకుండా బైపాస్‌ రోడ్డులో వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న కారుని సైతం ఢీకొట్టాడు. అయితే, కారులో ఉన్న వారికేమీ కాలేదు. చివరకు అక్కడే లారీని ఆపి పారిపోగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తోట నాగరాజు తెలిపారు.

ఓసీలో వరద నిల్వకుండా చర్యలు

వీసీలో ఆదేశించిన సింగరేణి సీఎండీ శ్రీధర్‌

సత్తుపల్లిరూరల్‌: సింగరేణి ఓపెన్‌ కాస్ట్‌ల్లో వర్షాకాలంలో నిలిచే నీటిని ఎప్పటికప్పుడు తోడివేయడానికి అవసరమైనన్ని మోటార్లు సిద్ధం చేసుకోవాలని, నీరు తొలగిస్తూ బొగ్గు ఉత్పత్తి, రవాణాకు అంతరాయం కలగకుండా చూడాలని సింగరేణి సీఎండీ శ్రీధర్‌ ఆదేశించారు. హైదరాబాద్‌ నుంచి బుధవారం ఆయన ఏరియాల వారీగా సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు రాకుండా చూసుకోవాలని, ఒకవేళ ఉత్పత్తి నిలిచిపోయినా రవాణా చేసేందుకు వీలుగా బొగ్గు నిల్వ చేయాలని ఆదేశించారు. ప్రతీనెలా ఏరియాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సీఎండీ స్పష్టం చేశారు. కాగా, సత్తుపల్లిలోని ఓసీ కార్యాలయం నుంచి వీసీకి కొత్తగూడెం ఏరియా జనరల్‌ మేనేజర్‌ ఎం.షాలేంరాజు, అధికారులు రామకృష్ణ, వెంకటాచారి, నర్సింహారావు, రవీందర్, యోహాన్, మదన్‌మోహన్, రమణారెడ్డి హాజరయ్యారు.



సత్తుపల్లి నుంచి వీసీకి హాజరైన అధికారులు

యుద్ధప్రాతిపదికన విద్యుత్‌ పునరుద్ధరణ

ఎన్పీడీసీఎల్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వరరావు



పాలేరు వద్ద మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

కూసుమంచి: భారీ వర్షాలు, వరదతో దెబ్బతిన్న విద్యుత్‌ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తూ సరఫరా పునరుద్ధరిస్తున్నామని ఎన్పీడీసీఎల్‌ డైరెక్టర్‌ బుగ్గవీటి వెంకటేశ్వరరావు తెలిపారు. కూసుమంచి మండలంలోని పాలేరు ఏటి పరివాహక ప్రాంతంలో వరదలతో దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని 17 జిల్లాల్లో వరదల కారణంగా రూ.45 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. అందులో ఎక్కువగా జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలో నష్టం నమోదు కాగా ములుగు, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో కూడా నష్టం తీవ్రత ఉందని చెప్పారు. ఒక్క భూపాలపల్లి జిల్లాలోనే 10 వేల స్తంభాలు, 700 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా వేగంగా మరమ్మతు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, వరదల సమయంలోనూ తమ సిబ్బంది విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కృషి చేశారని గుర్తు చేశారు. జిల్లా ఎస్‌ఈ సురేందర్‌ మాట్లాడుతూ.. జిల్లాలో 950 స్తంభాలు, 180 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, పాలేరు, మున్నేరు, ఆకేరు పరీవాహకంలో ఎక్కువ నష్టం జరిగిందని చెప్పారు. మరో మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేసి అన్నిచోట్ల సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ నాగేశ్వరరావు, కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్, ఏఈలు వెంకన్ననాయక్, గ్రేస్‌ సృజన పాల్గొన్నారు.

డోర్నకల్‌ రూట్‌లో బస్సులు కొనసాగించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: జీకే బంజర, డోర్నకల్‌ రూట్‌లో ఆర్టీసీ సర్వీసులు కొనసాగించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. బుధవారం ఖమ్మం ఆర్టీసీ డీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే బస్సులను ఆపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విద్యాభ్యాసం కోసం ఖమ్మం వచ్చే కోటపాడు, చిమ్మపుడి, పాపటపల్లి తదితర గ్రామాల విద్యార్థులు ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే బస్సు పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సాధిక్, లక్ష్మి, రమ్య, యాకూబ్‌ పాషా తదితరులు పాల్గొన్నారు.

యంత్రాంగం నిర్లక్ష్యంతోనే వరద కష్టాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



పెనుబల్లి వంతెనను పరిశీలిస్తున్న కూనంనేని

చుంచుపల్లి/పాల్వంచ: అధికార యంత్రాంగానికి ముందుచూపు లేకపోవడంతోనే ఏటా వర్షాకాలంలో ఏజెన్సీ ప్రజలు ముంపు బారిన పడి నష్టపోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న చుంచుపల్లి మండలం పెనుబల్లి బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం ఆయన పాత కొత్తగూడెంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ఏటా ప్రజలు ముంపు బారిన పడుతున్నా శాశ్వత చర్యలు చేపట్టడంపై ఎవరూ దృష్టి సారించడం లేదన్నారు. పాల్వంచ చెక్‌డ్యామ్‌ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో వరదలకు ధ్వంసమై రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పెనుబల్లి వంతెన శిథిలావస్థకు చేరినా పట్టించుకోకపోవడంతో ప్రజలకు బాహ్యాప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని పేర్కొన్నారు. ఇకనైనా కంటితుడుపు చర్యలు కాకుండా వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించాలన్నారు. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులను వెంటనే మరమ్మతు చేయాలని కూనంనేని డిమాండ్‌ చేశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని నవభారత్‌ నుంచి శేఖరంబంజర వరకు దెబ్బతిన్న రోడ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. అలాగే, సమస్యలపై మున్సిపల్‌ కమిషనర్‌ స్వామితో ఫోన్‌లో చర్చించారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బాగం మహేశ్వరరావు, రెడ్డి శ్రీను, కిలారు ప్రసాద్, కూసపాటి శ్రీనివాస్, జ్యోతి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, జకరయ్య, బిక్కులాల్, రామకృష్ణ, బాలు, గోపాల్‌రావు, వెంకట్రామయ్య జ్యోతి, లక్ష్మి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.